క్లుప్తంగా

గోడను ఢీకొన్న ట్రాలీ

నందిగామ టౌన్: పట్టణంలోని సీఎం రోడ్డులో అతి వేగంగా వస్తూ ప్రజల మీదకు దూసుకెళ్లబోయిన ట్రాలీ వాహనాన్ని పోలీసులు నియంత్రించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ట్రాలీ డ్రైవర్ అతివేగంగా చందర్లపాడు బస్టాండ్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ పక్క సందులోకి తిప్పే యత్నంలో గోడను ఢీకొట్టాడు. అప్పటికే ట్రాలీ ఆటోను వెంబడిస్తున్న పోలీసులు డ్రైవర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఉన్న పిల్లలమర్రి వెంకటేశ్వర్లు భవన్ సమీపంలో అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఎఫ్)జెండాను సీనియర్ నాయకుడు మహ్మద్ అసదుల్లా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జూనెబోయిన శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరిసె మధు, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె.చాంద్, సీపీఐ మండల కార్యదర్శి మెటికల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా కట్టలేరు



వీరులపాడు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో మండలంలోని దాములూరు కూడలి వద్ద వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహిస్తున్న సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రవికుమార్ వరద ఉధృతిని పరిశీలించి వీరులపాడు–నందిగామ మండలాల మధ్య రాకపోకలను నిలుపుదల చేశారు. ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కీసర వద్ద మునేరుకూ అదే పరిస్థితి...



కంచికచర్ల: ఎగువ ప్రాంతాలయిన పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, బోనకల్, వరంగల్, వైరా తదితర ప్రాంతాల్లో కుండపోతగా కురుస్తున్న వర్షాలకు మునేరుకు వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కంచికచర్ల మండలం కీసర వద్ద మునేరుకు 400 క్యూసెక్కుల నీరు చేరిందని సీడబ్ల్యూసీ అధికారులు గురువారం తెలిపారు. మునేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రైతులు తమ పశువులను తోలుకెళ్లరాదని, నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు హెచ్చరించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 7వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శంకుస్థాపన చేశారు. రూ.7 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నిర్మాణ పనులు 15 వ ఆర్థిక సంఘం నిధులతో జరుగుతున్నాయని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వలన వార్డులో ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఇంకా అవసరమైన అభివృద్ధి పనులు త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, వార్డు కౌన్సిలర్ పూసల సీతారావమ్మ, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సంకష్ట హర చతుర్థి పూజలు



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాస సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని బంగారు కొట్ల సెంటర్‌లో ఉన్న శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అర్చకుడు తెలదేవరపల్లి భరద్వాజ శర్మ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.

ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కూటమి సర్కారు



వీరులపాడు మండలం అల్లూరు గ్రామంలో క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నందిగామ ఆరవ వార్డులో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీలో వైఎస్సార్ సీపీ నాయకులు

వీరులపాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు, జుజ్జూరు గ్రామాలలో మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థంగా అమలు చేయలేదన్నారు. ముఖ్యంగా చంద్రబాబు పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా మోసపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఏడాది కాలంగా చేస్తున్న మోసాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బందెల రాణి, రమావత్ కోటి, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, నువ్వుల విశ్వనాథం, షేక్ షహనాజ్ బేగం, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీలు వేమూరి ఆదాం, షేక్ నాగుల్‌మీరా, ఎంపీటీసీ సభ్యులు మొండ్రు బాయమ్మ, కోటేరు విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు పూలా పూర్ణ, షేక్ జయాలుద్దీన్, పరిటాల నరసింహయ్య, పూలా పుల్లయ్య, కుంపటి శ్రీను, బెల్లంకొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది కాలంగా అరాచక పాలన

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో శాంతి, సుస్థిరతతో కూడిన పారదర్శక పాలన అందించగా, నేడు కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్ అన్నారు. పట్టణంలోని నాలుగు, ఆరు వార్డులలో మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత, సంకల్పం, సంక్షేమం, సమగ్రాభివృద్ధికి చిహ్నంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన నిలిచిందన్నారు. ముఖ్యంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఏడాది కాలంగా ఉన్మాద రాజకీయాలు తప్ప ప్రజా సంక్షేమానికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లమల్లి మురళి, షేక్ సుభానీ, తోట అంజారావు, సూరె రామారావు, కర్రి రవీంద్ర, షేక్ మున్నా, షేక్ యాకుబ్ అలీ, షేక్ జాఫర్, ఒర్సుకొండ, విజయలక్ష్మి, బెజవాడ రాజశేఖర్, గాడిపర్తి రామకృష్ణ, పోతురాజు, సుబ్బారావు, రాచూరి సీతారామ్, నాగమ్మ, జ్యోతి, దుర్గ, షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల సమస్యను నిర్లక్ష్యం చేయొద్దు



ఐతవరం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారులు



వీరులపాడు జెడ్పీ పాఠశాలలో నులి పురుగుల నివారణ మందు వేస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి



నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

నులి పురుగుల నివారణ మందులు పంపిణీ

నందిగామ రూరల్: నులిపురుగుల సమస్య ఉన్న చిన్నారులు ఆహారం తీసుకునేందుకు ఆసక్తి చూపరని, దీని వలన బరువు తగ్గటంతో పాటు పలు అనారోగ్య సమస్యలు దరి చేరుతాయని డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అధికారి (ఎన్‌హెచ్‌ఎమ్) నవీన్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఐతవరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారులతో కలిసి మంగళవారం ఆయన నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. మండలంలోని చందాపురం, జొన్నలగడ్డ, మాగల్లు, రుద్రవరంతో పాటు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేసి పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో లింగాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి కామేశ్వరి, ఎంపీహెచ్‌వో బిక్షాలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: నులి పురుగుల సమస్య నివారణకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన రోగాలు దరి చేరవన్నారు. ముఖ్యంగా నులి పురుగుల బారిన పడిన విద్యార్థుల్లో కడుపు నొప్పి, ఆకలి మందగించటం, బరువు తగ్గటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. అల్‌బెండాజోల్ ట్యాబ్‌లెట్లు వేసుకోవటం వలన నులి పురుగులను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు మనోరమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

గంప్రాయి(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేసినట్లు బూచవరం వైద్యాధికారి అనిల్ కుమార్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. మండలంలో 11,237 మంది విద్యార్థులుండగా 11,010 మందికి మందులు వేసినట్లు ఆయన చెప్పారు. సూపర్‌వైజర్‌లు నాగలక్ష్మి, రమేష్, వెంకట్రావ్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్‌లు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో మంచి ఆరోగ్యం



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి నాగలక్ష్మి

పెనుగంచిప్రోలు: నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవటం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్యాధికారి నాగలక్ష్మి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం వలన నులిపురుగులు వస్తాయని, వీటిని పట్టించుకోకపోతే ప్రాణాంతక పరిణామాలు సంభవిస్తాయన్నారు. మండలంలో 7320 మంది పిల్లలకు గాను 7214 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు (98.5 శాతం) పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి కూడా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా ఫార్మర్స్ సొసైటీ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ



కృష్ణా ఫార్మర్స్ సొసైటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న యానాల గోపీచంద్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ది కృష్ణా రైతు సేవా సహకార సంఘానికి నూతనంగా నియమితులైన నామినేటెడ్ కమిటీ సభ్యులు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చైర్‌పర్సన్‌గా అనుమంచిపల్లి గ్రామానికి చెందిన యానాల గోపీచంద్, మెంబర్లుగా షేర్‌మహ్మద్‌పేటకు చెందిన మెట్టెల రామారావు, వేదాద్రికి చెందిన మాడు సునీత బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో గౌరవరం పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్ కట్టా నరసింహారావు, జగ్గయ్యపేట శ్రీగోపాలకృష్ణ సొసైటీ చైర్‌పర్సన్ ధూళిపాళ్ల లక్ష్మణరావు, పోచంపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, సుభాని, రాష్ట్ర రైతుసంఘం ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్ పాల్గొని అభినందనలు తెలిపారు.

సీనియర్ ఫుట్‌బాల్ విజేత ఎన్టీఆర్ జిల్లా జట్టు

మైలవరం: కృష్ణా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కొల్లేరు గ్రూప్ సీనియర్ మెన్ ఫుట్‌బాల్ పోటీలు మైలవరం లకిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ముగిశాయి. కొల్లేరు గ్రూప్ నుంచి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. లీగ్ పద్ధతిలో జరిగిన పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 2–0 గోల్స్ తేడాతో గెలిచింది. ఏలూరు జిల్లా జట్టుపై 2–1 గోల్స్ తేడాతో, పశ్చిమ గోదావరి జట్టుపై 4–2 గోల్స్ తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన ఎన్టీఆర్ జిల్లా జట్టుకు లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజీ డైరెక్టర్ జి. శ్రీనివాసరెడ్డి ద్వారా బహుమతులు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా జట్టు ఈ నెల 16, 17 తేదీల్లో వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుంది.

వరదలకు కల్వర్టుల వద్ద దెబ్బతిన్న రోడ్లు



పెనుగంచిప్రోలు–సుబ్బాయిగూడెం రహదారిలో చెరువు కట్ట వద్ద వరదకు కొట్టుకు పోయిన రోడ్డు

పెనుగంచిప్రోలు: ఇటీవల వచ్చిన భారీ వర్షాలు, వరదలకు వాగు కల్వర్టుల వద్ద రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వరద నీరు కల్వర్టుల పైన ప్రవహించటంతో ఇరువైపుల రోడ్లు కూడా తారు కొట్టుకు పోయి కంకర పైకి తేలింది. పెనుగంచిప్రోలు–సుబ్బాయిగూడెం, ముచ్చింతాల–తాళ్లూరు, పెనుగంచిప్రోలు–అనిగండ్లపాడు, శనగపాడు, గుమ్మడిదుర్రు వద్ద వరదలకు వాగులు పొంగి రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 421 మందికి పరీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక 13,14 వార్డులకు సంబంధించి విలియంపేటలో గ్రీన్ సిటీ వద్ద రెండవ రోజు మంగళవారం ఏర్పాటుచేసిన మెగా ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 421 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వారికి అవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేసినట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు తెలిపారు. వారిలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నవారు 246 మంది, జనరల్ వైద్య పరీక్షలు చేయించుకున్నవారు 124 మంది, దంత వైద్యపరీక్షలు చేయించుకున్నవారు 51 మంది అని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో లోపాలు ఉండి కళ్లజోళ్లు అవసరమైన వారు 150 మంది, ఆపరేషన్లు అవసరమైన వారు 87 మంది అని తెలిపారు. ఈనెల 16 వ తేదీ ఉదయం 8 గంటలకు సాయికృప థియేటర్ వద్ద 24,25,26, 27,28 వార్డులకు సంబంధించిన వారికి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మేనత్త గొంతు కోసిన మేనల్లుడు

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

వెంగనాయకునిపాలెం(పెనుగంచిప్రోలు): మేనత్త గొంతును కత్తితో కోసి పరారైన మేనల్లుడిని గంటల వ్యవధిలో పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని వెంగనాయకునిపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యాదల మరియమ్మ, భర్త రాంబాబు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుంటారు. వరసకు మేనల్లుడు అయిన ముల్లగిరి నరేంద్రకు, మరియమ్మకు డబ్బుల విషయమై ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో నరేంద్ర కోపంతో మరియమ్మను కూరగాయల కత్తితో గొంతుపై కోసి పరారయ్యాడు. ఆమెను స్థానికులు నందిగామ ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. నందిగామ ఏసీపీ తిలక్ ఆదేశాల మేరకు జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని పరిశీలించి మూడు బృందాలుగా ఏర్పడి నిందితుడు నరేంద్రను గంటల వ్యవధిలో పట్టుకున్నామని ఎస్ఐ అర్జున్ తెలిపారు. గతంలో కూడా నరేంద్ర తన తండ్రిపై దాడి చేసి హత్య చేసిన ఘటనలో జైలుకు వెళ్లి వచ్చాడన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

పట్టించుకోని అధికారులు..



జగ్గయ్యపేట రోడ్డులో వృథాగా పోతున్న తాగునీరు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలో జగ్గయ్యపేట వెళ్లే రహదారిలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా వత్సవాయి మండలం లింగాల ప్రధాన తాగునీటి పైప్‌లైను పగిలిపోవటంతో గత నాలుగు రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. గ్రామానికి లింగాల మంచినీటి పథకం నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. పైపులైన్ పైన ఉన్న రహదారిపై నాలుగు రోజుల క్రితం భారీ వాహనాలు వెళ్లటంతో పైప్‌లైన్‌లు పగిలిపోయాయి. తాగునీరు వృథాగా పోతుండటంతో సమీప ప్రాంతం చిన్నపాటి చెరువును తలపిస్తోంది. ఇటీవల పోలీస్ స్టేషన్ సమీపంలో కూడా పైప్‌లైన్ పగిలి పోవటంతో వారం రోజుల పాటు ప్రజలు తాగునీటి కష్టాలు పడ్డారు. మరమ్మతులు చేసిన రోజుల వ్యవధిలోనే పైప్‌లైన్ పగిలిపోవటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్‌లు పగలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలంపల్లి డ్యాం పూర్తిచేయాలి



పోలంపల్లి డ్యాంను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పోలంపల్లి(వత్సవాయి): అసంపూర్తిగా నిలిచిపోయిన పోలంపల్లి మునేరు డ్యాంను వెంటనే పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్రా సూర్యనారాయణ డిమాండ్ చేశారు. పోలంపల్లి డ్యాంను స్థానిక రైతు సంఘం నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21 ఏళ్ల క్రితం పోలంపల్లి వద్ద మునేటిపై ఆనకట్ట నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. మొదట్లో పనులు ప్రారంభం కాగా తరువాత కాలంలో నిలిచిపోయాయన్నారు. బ్రిటిష్ హయాంలో నిర్మాణం చేసిన చెక్‌డ్యాం నుంచే నేటికీ రైతులకు సాగునీరు అందుతోందని చెప్పారు. డ్యాం పూర్తయితే నీరు నిల్వ ఉండి రెండు పంటలు పండే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే డ్యాంపై దృష్టి పెట్టి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు, కౌలు రైతు సంఘ జిల్లా నాయకుడు చిరుమామిళ్ల హనుమంతరావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు తమ్మినేని రాంబాబు, కౌలు రైతు సంఘ మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, ఏనుపోగు వెంకటరత్నం, కంచర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



పురుగు మందుల పిచికారీని రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గత రెండు రోజులుగా పత్తి, మిరప, మొక్కజొన్న పంటలలో జరుగుతున్న సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ మనోజ్ పూరి గోస్వామి మాట్లాడుతూ రైతులు విరివిగా భూసార పరీక్షలు చేయించాలన్నారు. ముఖ్యంగా అజోల్ల, వానపాముల ఎరువులు తయారీ ఉపయోగాలు, విత్తన శుద్ధి వలన లాభాలను రైతులకు వివరించారు. పురుగుమందు పిచికారీని రైతులు క్రమపద్ధతిలో చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరుచుకోవాలన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సస్య రక్షణ శాస్త్రవేత్తలు వీరయ్యచౌదరి, ప్రేమ రంజితం, కేవీకే కోఆర్డినేటర్ అచ్చుతరాజు, పరిశోధన స్థానం శాస్త్రవేత్త కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి లైన్‌మెన్ మృతి



నాగేశ్వరరావు

వీరులపాడు: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి స్తంభంపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని జంతి గ్రామంలో చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు జి.కొండూరు మండలం చెరువుమాధవరం గ్రామానికి చెందిన గుగులోతు నాగేశ్వరరావు (32) మండలంలోని జయంతి గ్రామ జూనియర్ లైన్‌మెన్. గ్రామంలోని బీసీ కాలనీలో విద్యుత్ సరఫరా కావడం లేదని ఫిర్యాదు చేయటంతో స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురవటంతో పై నుంచి కిందపడ్డాడు. నాగేశ్వరరావు తలకు బలమైన గాయం కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీ4పై సమీక్షా సమావేశం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో పీ4, అన్నదాత సుఖీభవపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన బంగారు కుటుంబ సభ్యులను గుర్తించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం రాని రైతులు గ్రామ సచివాలయాలలో సంప్రదించాలన్నారు.